# మరో 1,612 పోస్టుల భర్తీకి అనుమతి

- బీసీ గురుకులాల్లో 628 పోస్టులు
- పోలీసుశాఖలో ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు 485.. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ 499 పోస్టులు
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ
- త్వరలో నోటిఫికేషన్లు వెలువడే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో పోలీస్‌శాఖ, బీసీ గురుకుల విద్యాలయాల్లో కలిపి 1,612 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఇందులో బీసీ గురుకుల విద్యాలయాల్లో 628 పోస్టులుండగా, పోలీస్‌శాఖలో 485 ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్ల పోస్టులతోపాటు, 499 అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పోస్టులున్నాయి. ఈ మేరకు అనుమతులిస్తూ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ శివశంకర్ సోమవారంనాడు వేర్వేరు ఉత్తర్వులు జారీచేశారు. మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలో పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రత్యక్ష పద్ధతిలో నియామకాలు చేపట్టనున్నట్టు ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. పోలీస్‌శాఖలోని 485 'స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్' (ఎస్పీఎఫ్) కానిస్టేబుళ్ల నియామకాలను పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా చేపట్టనుండగా, మరో 499 పోస్టులను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపట్టనున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపారు.

**త్వరలో 18వేల పోలీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**

శాంతిభద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం కేసీఆర్ పోలీసుశాఖలో ఉద్యోగాల నియామకాలపై దృష్టిపెట్టారు. పోలీసుశాఖలో ఎంతమంది సిబ్బంది అవసరం ఉన్నదో తెలుపాలంటూ గతంలోనే హోంశాఖను అడిగారు. దీంతో హోంమంత్రి సారథ్యంలో పలుమార్లు సమావేశమైన డీజీపీ, ఇతర సీనియర్ పోలీసు అధికారులు అన్ని విభాగాలను పరిశీలించి, ముప్పైవేల పోస్టులు (అన్ని విభాగాల్లో కానిస్టేబుళ్లు, ఎస్సైలు) అవసరమని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి వెంటనే ఆర్థికశాఖకు పంపించారు. తొలుత ఆర్థికశాఖ పన్నెండువేల ఉద్యోగాల నియామకానికి అనుమతివ్వగా.. వీటికి నోటిఫికేషన్ జారీచేసి, నియామక ప్రక్రియ, శిక్షణను కూడా పూర్తిచేశారు. మిగతా పద్దెనిమిదివేల పోస్టుల నియామకం జరుగాల్సి ఉన్నది. గతనెల 3న 14,177 పోలీసు ఉద్యోగాల నియామకానికి అనుమతిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా సోమవారంనాడు 485 ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లతోపాటు మరో 499అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల నియామకానికి అనుమతిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆర్థికశాఖ అనుమతుల నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి సూచనతో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు కూడా 18,000ల ఉద్యోగాల నియామకంపై కసరత్తు చేస్తున్నది. పోలీసు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ కూడా అందుకు అనుగుణంగా సిద్ధమవుతున్నాయి. నోటిఫికేషన్, సిలబస్, శిక్షణకు సంబంధించిన అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే 18,000ల పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ కూడా వెలువడనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

**బీసీ గురుకులాల్లో పోస్టుల వివరాలు**

| క్యాటగిరీ | సంఖ్య |
|---|---|
| పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు | 543 |
| ఫిజికల్ డైరెక్టర్ (డిగ్రీ కళాశాలలు) | 1 |
| ఫిజికల్ డైరెక్టర్ (పాఠశాలలు) | 60 |
| ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పాఠశాలలు) | 3 |
| లైబ్రేరియన్ (డిగ్రీ కళాశాలలు) | 1 |
| అసిస్టెంట్ లైబ్రేరియన్ (డిగ్రీ కళాశాల) | 1 |
| జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ | 19 |
| బీసీ గురుకులాల్లో మొత్తం పోస్టులు | 628 |

**పోలీస్‌శాఖలో పోస్టుల వివరాలు**

| క్యాటగిరీ | సంఖ్య |
|---|---|
| ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు | 485 |
| జూనియర్ అసిస్టెంట్లు | 368 |
| సీనియర్ అసిస్టెంట్లు | 12 |
| జూనియర్ స్టెనో, ఎల్‌డీ స్టెనో | 29 |
| టైపిస్టులు | 89 |
| లైబ్రేరియన్ | 1 |
| పోలీస్‌శాఖలో మొత్తం పోస్టులు | 984 |